ఇంకా వరద నీటిలోనే..

- కొత్తవలస ఆర్టీసీ కాంపెక్స్ ప్రాంగణాన్ని వీడని వరద నీరు
- ఎల్.కోట ఎస్సీ బాలుర వసతి గృహంలోనూ అదే దుస్థితి

కొత్తవలస: అల్పపీడనం ప్రభావంతో శనివారం, ఆదివారం కురిసిన భారీ వర్షాలకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను వరద నీరు ముంచెత్తింది. వర్షం వదిలి అయిదు రోజులు అవుతున్నా నేటికీ కాంప్లెక్స్ ప్రాంగణంలో వరద నీరు అలాగే ఉంది. కాంప్లెక్స్ ముఖద్వారం వద్ద ముడుకు లోతులో నిలిచిన నీరు మురుగుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నీటిలో నుంచి ప్రయాణికులు కాంప్లెక్స్‌లోకి వెళ్లేందుకు అవస్థలు పడు తున్నారు. కొంతమంది ప్రయాణికులు చుట్టూ తిరిగి కాంప్లెక్స్‌కు వెనుక వైపు నుంచి వేరే మార్గంలో వస్తున్నారు. అలాగే జీవనోపాధికి విశాఖపట్నం,విజయనగరం పట్టణాలకు రాక పోకలు సాగించే వారు తమ ద్విచక్రవాహనాలను గతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ పార్కింగ్ స్థలంలో ఉంచేవారు. పార్కింగ్ ప్రాంతం ఇంకా వరద నీటి లోనే ఉండడంతో తమ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసుకోవాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు వరద నీటిని మళ్లించే చర్యలు చేపట్టకపోవడంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏమాత్రం వర్షం కురిసినా అంతే..

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని ఏస్సీ బాలుర వసతి గృహం సముదాయంలో నిలిచిన వరద నీటి వల్ల విద్యార్థులు ఇబ్బంది లు పడుతున్నారు. 2016లో ఈ హాస్టల్ భవనాలను నిర్మించారు. అయితే లోతట్టు ప్రాంతంలో భవనాలు నిర్మించడం వల్ల ఏ మాత్రం వర్షం కురిసినా ఇక్కడ వరద నీరు నిలిచిపోతుంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు చేరిన నీరు మురుగుపోయి దుర్గంధం వస్తుండ డంతో పాటు దోమలు విజృంభిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌లో 52 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ప్రస్తుతం జ్వరాలతో కొంతమంది, ఈ ఇబ్బందులు పడలేక మరికొంత మంది తమ ఇళ్లకు వెళ్లిపోయారు. కొద్దిపాటి వర్షం కురిసినా హాస్టల్‌లోకి నీరు చేరిపోతోందని, దోమలు నిద్రలేకుండా చేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.



కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్ ముఖ ద్వారం వద్ద నిలిచిన వరద నీరు



ఎల్.కోట ఎస్సీ వసతి గృహ సముదాయాన్ని వీడని వరదనీరు

జీఓ 115ను రద్దు చేయాలి



శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో ధర్నా చేస్తున్న జీఎన్ఎంలు



గజపతినగరం : ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న స్టాఫ్ నర్సులు

శృంగవరపుకోట: తమకు నష్టం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 115ను తక్షణం రద్దు చేయాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో జీఎన్ఎంలు గురువారం ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడున్నరేళ్ల జీఎన్ఎం కోర్సు, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సులు చేసి గత కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్న తమను రెగ్యులర్ చేయకుండా, ఇప్పుడు తమను కాదని సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను ఇక్కడ స్టాఫ్ నర్సులుగా నియమించేందుకు జీఓ ఇవ్వడం అన్యాయమని వాపోయారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో ప్రస్తుతం పని చేస్తు న్న వారందరినీ రెగ్యులర్ చేశాక మిగతా వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం పక్షపాత వైఖరితో, కొత్త ఉద్యోగాలు కల్పించామని చాటుకోడానికో, దండుకోడానికో శిక్షణ పొందిన వారితో ఏఎన్ ఎం లుగా, స్టాఫ్ నర్సులుగా నియామకాలు చేస్తే తమ భవిష్యత్ ఏం కావాలని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇస్తాం, ఉపాధి చూపిస్తాం అంటే పది కుటుంబాల ఉపాధి తీసేసి రోడ్డున నెట్టేసి, మరో పది మందికి ఉపాధి ఇవ్వడమేనా అంటూ నిలదీశారు.

గజపతినగరంలో..

గజపతినగరం: జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద స్టాఫ్ నర్సులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతితో అరకొర జీతాలతో పని చేస్తున్న తమని ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న తమ స్థానంలో కొత్త వారిని నియమించేందుకు ప్రభుత్వం చూడడం బాధాకరమన్నారు. ఐ.ధనుంజయరావు, జె.శాంతి, సంధ్య, హేమలత, ఏ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి స్వాధీనం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని దేవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 166లో ఆక్రమిత 2.20 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు గురువారం తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులతో గతంలో రెవెన్యూ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించారని చెప్పారు. అయితే ఆ భూమిలో కొంత మంది రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని, వారికి పంచాయతీ కార్యదర్శి ద్వారా తాజాగా నోటీసులు పంపించామని వివరించారు. ఎంపీడీఓ భాస్కరరావు, ఎస్ఐ లోకేశ్వర రావుతో కలిసి రైతుల నుంచి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

శృంగవరపుకోట: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయం అందించేందుకు సీపీఐ నాయకులు ఎస్.కోట పట్టణంలో గురు వారం విరాళాలు సేకరించారు. స్థానికులు, వ్యాపారులు, పెద్దలు, గ్రామస్తుల నుంచి రూ.5 వేలు పోగు చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డేగల అప్పలరాజు, మండల కార్యదర్శి ఖండిపల్లి భీముడు, కళాసీల సంఘం మేస్త్రి శ్రీను, పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్ రేపు

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ మెగాలోక్ అదా లత్ నిర్వహించనున్నట్లు జడ్జి బి.కనకలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిష్కారానికి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ తదితర కేసులను కక్షిదారులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తప్పులు సరిదిద్దేందుకే సర్వే

దత్తిరాజేరు: ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దేందుకు, 18 ఏళ్ల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఇంటింటి సర్వే చేపడుతున్నామని గజపతినగరం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి(ఈఆర్ఓ) ప్రమీలా గాంధీ అన్నారు. మండలంలోని పెదమానాపురం, దత్తి, మరడాం గ్రామాల్లో బీఎల్ఓలతో కలిసి గురువారం సర్వే నిర్వహించారు. ఓటర్ల జాబితా తీసుకుని ఇంటింటికీ వెళ్లి ఆ ఇంటిలో ఓటర్ల పేర్లు, ఫొటోలు, చిరునామా సరిగా ఉన్నయా లేదా, ఆ కుటుంబ ఓటర్లు అంతా ఒకే వార్డు, పోలింగ్ బూత్ పరిధిలో ఉన్నారా లేదా అని పరిశీలించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉన్నా వారందరినీ ఒకే వార్డులో వరుస సంఖ్యలో ఉండేలా చూడాలని బీఎల్ఓలకు సూచించారు. మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించి 18 ఏళ్ల నిండిన వారికి వెంటనే ఓటు హక్కు కల్పించాలని చెప్పారు. డీటీ గౌరీశంకర్, సీఎస్‌డీటీ ధనలక్ష్మి, భూసర్వే డీటీ రత్నకుమారి పాల్గొన్నారు.



మరడాంలో సర్వే చేస్తున్న ఈఆర్ఓ ప్రమీలా గాంధీ, బీఎల్ఓలు

సమస్యల పరిష్కారానికే గ్రామసందర్శన

ప్రజాసమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓల ఆధ్వ ర్యంలో జామి మండలంలోని వి.ఆర్.పాలెం, బొండపల్లి మండలంలోని కొండకిండాం, చీపురుపల్లి మండలంలోని కర్లాం, గజపతినగరం మండలంలోని గుడివాడ, వేపాడ మండలంలోని వీలు పర్తి, దత్తిరాజే రు మండలంలోని భూపాలరాజపురం, ఎల్.కోట మండలంలోని జమ్మాదేవిపేట,కొత్తవలస మండలంలోని చీడివలస, గంట్యాడ మండలంలోని రామవరం గ్రామంలో మండల, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గురు వారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్ హించారు. ఆయా గ్రామాల్లో ప్రజల తో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని వంట నిర్వాహకులకు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. వీలుపర్తిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను, రైతులు తయారు చేసిన కషాయాలను పరిశీలించారు. జమ్మాదేవిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు.

– జామి/ బొండపల్లి/చీపురుపల్లి/గజపతినగరం/వేపాడ/దత్తిరాజేరు/లక్కవరపుకోట/కొత్తవలస/ గంట్యాడ



జామి: వి.ఆర్.పాలెం ప్రాథమికపాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న అధికారులు



చీపురుపల్లి: కర్లాం పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ శిరీష, అధికారులు



గజపతినగరం: గుడివాడలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, ఎంపీపీ జ్ఞానదీపిక, జెడ్పీటీసీ తవుడు



వేపాడ: వీలుపర్తిలో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న అధికారులు



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు



దత్తిరాజేరు: భూపాలరాజపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి జోషెఫ్, తదితరులు



గంట్యాడ: రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

క్లుప్తంగా

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

బొండపల్లి: గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమించినా, కబ్జాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఏయే గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయో గుర్తించి నివేదికలు ఇవ్వాలని వీఆర్‌ఓలను ఇప్పటికే ఆదేశించామని చెప్పారు.ప్రభుత్వ భూములను కాపాడేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు.అలాగే అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపట్టే వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. గ్రావెల్ తవ్వకాలు చేపట్టే జేసీబీలతో పాటు తరలించే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో భూఆక్రమణలు జరగకుండా, అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామాల పరిధి వీఆర్‌ఓలదేనని స్పష్టం చేశారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: వాతావరణ మార్పుల వల్ల జ్వరాలు, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.పుష్పాంజలి సూచించారు. మండలంలోని లోగిశ గ్రామం లో గురువారం 104 సిబ్బందితో కలిసి వైద్యశిబిరం నిర్వహించారు. 61 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, జ్వరం, తలనొప్పి, దగ్గు, తదితర అనారోగ్య సమస్యలతో ఉన్న వారికి మందులు అందజేశారు. అనంతరం ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

దబ్బిరాజుపేటలో పారిశుద్ధ్య పనులు



రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగిస్తున్న కార్మికులు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామరలో సర్పంచ్ దండు ముత్యాలమ్మ గురువారం పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను, తుప్పలు, డొంకలను కార్మికులు తొలగించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రత, జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సర్పంచ్ సూచించారు.

17న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

వేపాడ: జాతీయ నులుపురుగుల నిర్మూలన దినోత్సవం నేపథ్యంలో ఈనెల 17న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి తెలిపారు.సంబంధిత వాల్‌పోస్టర్లను వీలుపర్తిలో గురువారం నిర్వహించిన గ్రామసందర్శన కార్యక్రమంలో అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, 6 నుంచి 19 ఏళ్ల లోపు బాలురు, బాలికలకు విద్యాలయాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు మాత్రలు పంపిణీ చేస్తారని చెప్పారు. ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, ఎంఈఓ జగదీశ్వర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, ఐకేపీ ఏపీఓ వెంకటరమణ, సీహెచ్ఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరావు

విజయనగరం ఫోర్ట్: క్షయ, హెచ్‌ఐవీ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక సబ్‌జైలులో హెచ్‌ఐవీ, క్షయ, లెప్రసీ వ్యాధులపై లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్‌ఐవీ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

సహాయక చర్యల్లో వైఫల్యం

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: విజయవాడ వరద బాధితులకు పునరావాసం కల్పించడంలో, వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజలకు వర ద ముప్పు ఉందని ప్రభుత్వానికి ముందుగానే తెలిసినప్పటికీ ఎందుకు అప్రమత్తం చేయలేదో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాదానం చెప్పాలని నిల దీశారు. ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని, తమ స్వార్థ ప్రయో జనాల కోసం ప్రజలను బలి చేయకూడదన్నారు. వరదలకు 60 మంది వరకు చనిపోయారని, లక్షల మంది ఇబ్బందులు పడ్డారని, ఇదంతా ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమని అన్నారు నేటికీ కొన్ని ప్రాంతాలు ఇంకా వరద నీటిలోనే ఉండడం, మందులు, నిత్యవసరాలు అందడం లేదని వరద బాధితులు మీడియా ముందు చెబుతున్న తీరు బాధాకరమన్నా రు. నాడు కోవిడ్ లాంటి విపత్తును జగన్ మోహన్‌రెడ్డి సమర్థంగా ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. నేడు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం విజయ వాడలో ఉండి కూడా ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. వరద తగ్గిన తర్వాత అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్, క్లోరినేషన్, ప్రజారోగ్యం, పునరావాసం, ఉపాధి కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టిసారించాలని సూచించారు.



కె.శ్రీనివాసరావు

అన్నదానం



చీపురుపల్లి: భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ శిరీష



దత్తిరాజేరు: అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చీపురుపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లావేరురోడ్‌లో ఏర్పాటు చేసిన మండ పం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష ఈ కార్యక్ర మాన్ని ప్రారంభించారు. నిమజ్జనోత్సవాల్లో అపశృతులు జరగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటించాలని సూ చించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, రఘుపాత్రుని శివ, భారతి, గవిడి కల్కి, గవిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిపల్లిలో..

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి వినాయక మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురు వారం అన్న దానం చేశారు. 2 వేలమంది స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: మండలంలోని గత్సలవలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మెట్టపల్లి, కర్లాం, కరకాం, పేరిపి, నిమ్మలవలస గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫ రాలో అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి శ్రీహరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేప థ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుర్ల మండలంలో..

గుర్ల: మండలంలోని గుర్ల, నాగళ్లవలస సబ్ స్టేషన్‌లలో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆ సబ్‌స్టేషన్‌ల పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ హరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుర్ల గ్రామానికి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వర కు, అలాగే నాగళ్లవలస, తాటిపూడి, గొలగాం, వల్లాపురం, జమ్ము, శేషుపేట, జమ్ముపేట, సదానందపురం, చిన్ననాగళ్లవలస గ్రామాల కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మరడాం ఫీడర్ పరిధిలో..

దత్తిరాజేరు: మండలంలోని మరడాం ఫీడర్ పరిధిలో శుక్రవారం మెయింటెనెన్స్, విద్యుత్ లైన్లకు అనుకుని ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న ట్లు విద్యుత్ శాఖ ఏఈ ఆదిత్య గురువారం తెలిపారు. ఈనేపథ్యంలో పెదమానాపురం, ముద్దానపేట వంగర, మరడాం, గుడివాడ, తాడేం దొరవలస, మర్రివ లస గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహక రించాలని కోరారు.

పురిటిపెంటలో..

గజపతినగరం: గజపతినగరం టౌన్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పురిటిపెంట గ్రామానికి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏడీఏ శివకుమార్ గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేపాడ సబ్‌స్టేషన్ పరిధిలో..

వేపాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు అనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సర ఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ జి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గం టల వరకు నీలకంఠరాజపురం, పెదగుడిపాల, భర్తవానిపాలెం, బక్కునాయుడు పేట, రాయుడుపేట, చినగుడిపాల, నల్లబిల్లి, సంజీవమెట్ట, సంజయపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాల్య వివాహాలను అరికడదాం

దత్తిరాజేరు: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వాటిని అరి కట్టేందుకు కృషి చేద్దామని మహిళల, చైల్డ్ రైట్స్ కో–ఆర్డినేటర్ సరస్వతి పిలుపునిచ్చారు. మండలంలోని అంగ న్‌వాడీ కార్యకర్తలకు కోమటిపల్లిలోని ఓ కల్యాణ మండపంలో ఐసీడీఎస్ పీఓ నాగమణి అధ్యక్షతన గురువా రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 ఏళ్ల వయస్సు వచ్చే వర కు పెళ్లి చేయకూడదని, వారిని మగపిల్లలతో సమానంగా చదివించాలని సూచించారు. తక్కువ వయస్సులో వివాహం చేయడం వల్ల వచ్చే సమస్యలను వివరించారు. అలాగే బాలలు, మహిళల రక్షణ చట్టాలు, హక్కుల పై వన్‌స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం సంబంధిత వాల్‌పోస్టర్లను ఆవిష్క రించారు. వన్ స్టాప్ సెంటర్ కో–ఆర్డినేటర్ అనిత, ఎన్‌జీఓ హరీష్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు అపర్ణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

గజపతినగరం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకీ తీరని లోటని ఆ పార్టీ నాయకుడు ఒమ్మి రమణ, సీఐటీయూ నేతలు వి.లక్ష్మి, జి.శ్రీనివాస్ అన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం సీతారాం మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఎస్ఎఫ్ఐ నుంచి అంచెలంచెలుగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారని కొనియాడారు. కుల, మతతత్వానికి వ్యతిరేకంగా, నిరుపేదలు, కార్మికులు, రైతుల పక్షాన పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు తామంతా కృషి చేస్తామన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

జామి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సతీష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.